ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
సోమవారం 27 అక్టోబరు 2025




వైభవంగా యోగి నారేయణ విగ్రహ ప్రతిష్ఠ

7 జీఎస్టీ 2.0.. వ్యాపారులకు అనుకూలం
● ఎంపీ లెహర్‌సింగ్

బలవుతున్న బాలిక

● రాష్ట్రంలో మితిమీరుతున్న బాల్యవివాహాలు
● అధిక సంఖ్యలో మైనర్ గర్భిణులు
● టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం
● ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ
● తల్లిదండ్రులకు కౌన్సెలింగ్





ఆర్‌సీహెచ్ పోర్టల్

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఉన్నత విద్యాసంస్థలు అత్యధికంగా ఉన్న రాష్ట్రంగాను, ఏటా వృత్తివిద్యాకోర్సులలో లక్షలాది మంది నిపుణులను రూపొందిస్తోందని పేరున్న చోటునే సామాజిక దురాగతం అనిపించే బాల్యవివాహాలు ఏటా పెరుగుతుండడం విచారకరం. 15ఏళ్లు దాటితే చాలు ఆడబిడ్డలకు పెళ్లి చేసేయాలనే ఆలోచన కల్గిన తల్లిదండ్రుల్లో మార్పు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం రాష్ట్రస్థాయిలో బాల్యవివాహాల నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను సిద్ధం చేసింది. ప్రతి గ్రామంలోనూ టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసే బాధ్యతను పోలీసులకు అప్పగించింది. కేంద్రప్రభుత్వ పరిధిలోని పునరుత్పత్తి, పిల్లల ఆరోగ్యం (రీ ప్రొడక్టివ్, చైల్డ్ హెల్త్ - ఆర్‌సీహెచ్) పోర్టల్‌లో రాష్ట్రంలో అత్యధిక బాలగర్భిణులు ఉన్నారనే గణాంకాలు తేలుస్తున్నాయి. దీంతో పోలీసు, స్త్రీ శిశుసంక్షేమశాఖ, వైద్య ఆరోగ్యశాఖల సహకారంతో గ్రామస్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, బాల వికాస కమిటీల ద్వారా బాలికల తల్లిదండ్రులను చైతన్యం కలిగించే బాధ్యతను టాస్క్‌ఫోర్స్ అప్పగించాలని నిర్ణయించారు. పోక్సో చట్టం సెక్షన్ 19 ప్రకారం ఇకపై ప్రైవేట్ ఆసుపత్రుల్లో బాలికలు గర్భంతో ఆసుపత్రులకు వెళ్తే సంబంధిత డాక్టర్లు తప్పనిసరిగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చే విషయంలో నిర్లక్ష్యం చేస్తే సంబంధిత ఆసుపత్రి, వైద్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకునే వెసలుబాటు ఉంటుంది. పోలీసులకు సమాచారం ఇవ్వలేని పక్షంలో బాలల హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలనే సూచించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలను సిద్ధం చేస్తున్నారు.

6 నెలల్లో 144 కేసులు

రాష్ట్రంలో మైనర్లు గర్భిణులు అవుతున్న జిల్లాల్లో బెంగళూరు, బెళగావి, విజయపుర, రాయచూరు, దక్షిణకన్నడ, బీదర్ జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాల్లోనే ఎక్కువ మైనర్లు గర్భిణులు అయినట్టు నివేదికలు ఉన్నాయి. ఈ జిల్లాల్లోనే ఉన్నత విద్యా శాతం కూడా అత్యధింగా ఉంది. రాయచూరు, బీదర్ జిల్లాలను మినహాయిస్తే మిగిలిన జిల్లాలు ప్రగతిపరంలో ఉన్నవే. బెంగళూరులో 2024-25లో 18ఏళ్లలోపు బాలికలు గర్భం దాల్చినవారు 433 మంది ఉన్నట్టు నిర్ధారణ అయ్యింది. ఇటీవల 7 నెలల్లో 144 కేసులు వెలుగులోకి వచ్చాయి. మైనరు గర్భిణుల వివరాలను సేకరించాలి. ఇవ్వనిపక్షంలో ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్యులపైన పోక్సో కేసు నమోదు చేసే చట్టం ఉందని ప్రచారం చేయాలి.

హెల్ప్‌లైన్ 1098



పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో బాలికలు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మూడు రోజులు దాటి గైర్హాజరైతే అటువంటి విద్యార్థినుల సమాచారాన్ని హెడ్మాస్టర్‌లు సేకరించాల్సి ఉంటుంది. ఏమైనా అనుమానం ఉంటే 1098 హెల్ప్‌లైన్‌కు తెలపాలి. మానసిక, శారీరక, సామాజిక దుష్పరిణామాలకు సంబంధించి తప్పనిసరిగా పాఠశాలల్లో చైతన్యం కలిగించాల్సిన బాధ్యత టాస్క్‌ఫోర్స్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఇప్పటివరకు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదైన మైనరు బాలికల గర్భిణీల సమాచారాన్ని స్త్రీ శిశుసంక్షేమశాఖ, పోలీసులశాఖ నోడల్ అధికారికి తప్పనిసరిగా సమర్పించాలి. నివేదికను పరిశీలించిన తర్వాత స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారులు సంబంధిత స్థలాలకు వెళ్లి వారి వివరాలు సేకరించాలి.

టాస్క్‌ఫోర్స్ కార్యాచరణ

అత్యధిక బాలికలు గర్భిణులు అయిన జిల్లాలను గుర్తించాలి. ఏ తాలూకా లేదా ఏ గ్రామాల్లో అధికమంది ఉన్నారో పరిశీలించాలి. పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమశాఖల ముఖ్యులతో చర్చించాలి. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా చైతన్యసభలు జరపాలి. బాలికల్లో అవగాహన కల్పించేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, బాల వికాస సమితి, ఎన్‌జీఓల సహకారంతో కార్యక్రమాలు నిర్వహించాలి. పోలీసులు నిరంతరంగా పర్యవేక్షించాలి. బాల్య వివాహాలకు వివిధ సెక్షన్లు, జరిమానాలు, శిక్షల గురించి ప్రతి పల్లెలో చర్చించుకునేలాంటి అవగాహన పెంచాలి. గతంలో బాల్య వివాహాల ద్వారా శిక్షకు గురైన వారి వివరాలు ప్రస్తావించాలి. ఎన్జీఓల ద్వారా అంటువంటి వీడియోలు చూపి చైతన్యం కల్పించాలి.

రాష్ట్రంలో 14-18ఏళ్ల వయసుకల్గిన బాలికలు గర్భందాల్చి అనారోగ్యానికి గురవుతున్న విషయమై ప్రజలలో చైతన్యం, నియంత్రణకోసం సెప్టెంబరు 1న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ అధ్యక్షతన ప్రత్యేక సభ జరిగింది. వివిధశాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఉన్నతాధికారుల సూచన మేరకు గ్రామస్థాయిలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని తద్వారా బాల్య వివాహాలను అరికట్టడం సాధ్యమని ప్రస్తావించారు. ఇందుకు సంబంధించి అన్ని పోలీస్‌స్టేషన్లనుంచి సమాచారం సేకరించేలా డీజీపీ డాక్టర్ ఎంఏ సలీం ఆదేశాలు జారీచేశారు. బెంగళూరు నగర పరిధిలో 431 మంది మైనర్లు గత ఏడాది గర్భందాల్చినట్టు



వివరాలు ఉన్నా కేవలం 12మంది మాత్రమే శిక్షకు గురయ్యారు. 168 మంది నిందితులు ఉపశమనం పొందారు. 123 కేసులు ఇంకా విచారణ దశలోనే ఉన్నాయి. సదరు కేసుల విచారణ జాప్యం జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. కేసుల పరిష్కారం వేగవంతం చేసేలా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లకు సూచించింది.

కేసుల నమోదుకు నిర్ణయం

బాల్య వివాహాల కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత బాధిత బాలిక తల్లిదండ్రులను ముందుగా విచారణ జరపాలి. ఆ తర్వాత మహిళా ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్‌లచేత విచారణ జరిపించాలి. బాధిత బాలిక భవిష్యత్తు దృష్ట్యా మానసిక, శారీరకంగా ఇబ్బంది కలగకుండా వివాదాన్ని పరిష్కరించాలి. ఇందుకు సంబంధించి పోలీసులకు అవసరమైన శిక్షణ ఇవ్వాలని హోంశాఖకు పంపాలని నిర్ణయించకున్నారు. కఠిన చర్యలతోనే బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేయగలమని భావిస్తున్నారు.

నిమ్హాన్స్ సహకారం

వీటన్నింటికంటే మానసికంగా కౌన్సెలింగ్ జరిపేందుకు నిమ్హాన్స్ సంస్థ సహకారం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నిమ్హాన్స్ సంస్థ ఆన్‌లైన్ ద్వారా మానసికసమస్యలపై సలహాలు ఇస్తున్నారు. మైనరు గర్భిణీలు ఇంటినుంచి బయటకు వచ్చినప్పుడు వారిలో మానసికమైన ఒత్తిడి నియంత్రణకు నిమ్హాన్స్ వైద్యనిపుణులతో చైతన్యం కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆశా కార్యకర్తల సమన్వయం తీసుకుంటారు. తల్లీబిడ్డల ఆరోగ్య విషయంలోనూ ప్రత్యేక చొరవ చూపాలని ప్రభుత్వం కార్యాచరణలకు సిద్ధమైంది. బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టాలని ప్రభుత్వం ధృడ నిశ్చయంతో ఉంది. అవసరమైనే పోలీసుల చర్యలతో కఠిన చర్యలు తీసుకుని దురాచారాన్ని అణగదొక్కాలని నిర్ణయించుకుంది

తండ్రిని హతమార్చిన కుమారుడు

● ఆస్తి వివాదాలే కారణం

బెంగళూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదం నేపథ్యంలో మేకల కేటాయింపులకు సంబంధించి తలెత్తిన మనస్పర్థలు చివరకు తండ్రిని కొడుకు హతమార్చిన ఘటన చామరాజనగర జిల్లాలో చోటు చేసుకుంది. హనూరు తాలూకా గోపినాథం సమీపాన ఆతూరు గ్రామంలో ఘటన జరిగింది. కొంతకాలంగా మేకల పంపిణీకి సంబంధించి తండ్రీ కొడుకులమధ్య వాగ్వాదం సాగుతోంది. ఇలా ఉండగా శంకరన్ (70)ను రెండో కుమారుడు గోవిందరాజ్ బలమైన ఆయుధంతో గాయపరిచి సమీపంలోని కావేరి నది కాలువలోకి పడేశాడు. శంకరన్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మలెమహదేశ్వరకొండ పోలీస్‌స్టేషన్‌లో కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. శనివారం సాయంత్రం శంకరన్ మృతదేహం లభ్యమైంది. శంకరన్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేయగా గోవిందరాజ్ వాస్తవాన్ని అంగీకరించాడు. సీఐ జగదీశ్ నేతృత్వంలో తదుపరి దర్యాప్తు సాగుతోంది.

సొరంగ మార్గంతోనే ట్రాఫిక్ సమస్యకు చెక్

● 'బెంగళూరు నడకలో' డీసీఎంతో నగరవాసులు ● పారిశ్రామిక వేత్తలు సోదరులన్న డీకే


కబ్బన్‌పార్క్‌లో నగరవాసులతో మాట్లాడుతున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ అమాంతంగా పెరుగుతోందని రోడ్లు వెడల్పు చేసే పరిస్థితి లేదని, సొరంగ మార్గం సముచితమని పలువురు అభిప్రాయపడ్డారు. డీసీఎం డీకే శివకుమార్ ఆదివారం కబ్బన్‌పార్కులో 'బెంగళూరు నడక' కార్యక్రమం నిర్వహించారు. పార్కులో వాకింగ్‌చేస్తూ పలువురితో నగర సమస్యలపై చర్చలు జరిపారు. బీ ఖాతాలను ఏ ఖాతాగా మార్చే ప్రక్రియ మంచిదని పలువురు అభిప్రాయపడ్డారు. అనంతరం నిర్వహించిన చర్చాగోష్ఠిలో అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సొరంగమార్గం జరపవచ్చునని ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలలో కొనసాగుతోందని పలువురు అభిప్రాయపడ్డారు.

బెంగళూరు ఘనతను కాపాడండి

బెంగళూరు ఘనతను కాపాడాలని డీసీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. శనివారం రాత్రి పారిశ్రామికవేత్తలు కిరణ్‌మజుందార్‌షా, మోహన్‌దాస్‌పైలతోపాటు పలువురు డీసీఎంతో విందులో పాల్గొన్నారు. ప్రత్యేక సమావేశం గురించి ఆదివారం డీసీఎం మీడియాతో మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు తనకు సోదరులవంటివారన్నారు. వారు విమర్శించినంత మాత్రాన దూరం చేసుకోవడం సాధ్యం కాదన్నారు. వారి సలహాలు, సూచనలు పాటిస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో బెంగళూరుకు చెడ్డపేరు తీసుకురావడం మంచిదికాదన్నారు. రెడ్‌లైన్ మెట్రోకు సంబంధించి కేంద్రమంత్రితో చర్చిస్తామన్నారు. ఎంపీ తేజస్విసూర్య పలు అంశాలపై మాట్లాడారని, దానిని తాను వ్యతిరేకించేది లేదన్నారు. మంగళవారం తేజస్విసూర్య భేటీ అయ్యేందుకు సమయం కోరారన్నారు. కారణం ఏదైనా బెంగళూరు అభివృద్ధి జరగాల్సిందే అన్నారు. తాను లూటీ చేసి ఉంటే ఆ మొత్తాన్ని కేంద్రమంత్రి కుమారస్వామి తీసుకుపోవచ్చునన్నారు. బీ ఖాతాను ఏ ఖాతాగా మార్చడం ఒక ప్రక్రియ మాత్రమే అన్నారు. బీజేపీ వ్యవధిలోనే ఈ ప్రక్రియ ప్రారంభించారన్నారు. మంత్రివర్గ విస్తరణ అంశం అధిష్ఠానం, సీఎం చూసుకుంటారన్నారు.


జలకళతో కేఆర్‌ఎస్ డ్యామ్

నిండుకుండలా కేఆర్‌ఎస్

● ఏడాదిలో ఇది మూడోసారి..
● ప్రభుత్వంపై వరుణుడి కృప: డీసీఎం డీకే

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధమైన కృష్ణరాజసాగర్ (కేఆర్‌ఎస్) డ్యాం ఈ ఏడాదిలో మూడోసారి భర్తీ అయ్యింది. ఈ నేపథ్యంలో డీసీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ తమ ప్రభుత్వంపై వరుణుడి కృప ఉందన్నారు. కావేరి నది సంతృప్తిగా ప్రవహిస్తోందన్నారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో కేఆర్‌ఎస్ డ్యాం మూడోసారి భర్తీ అయ్యిందని తద్వారా బెంగళూరు నగరానికి వచ్చే వేసవిలో నీటికొరత ఉండదన్నారు. బీదర్ నుంచి చామరాజనగర్ వరకు, బళ్ళారి నుంచి కోలారు వరకు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురవడంతో జలాశయాలు, చెరువులు జలకళ సంతరించుకున్నాయన్నారు. తద్వారా ప్రజలకు, పశుపక్ష్యాదులకు తాగునీరు, సాగునీటికి సమస్య ఉండదన్నారు.

ఆలయం వద్ద ఎలుగుబంటి ప్రత్యక్షం


అంజనా దేవి ఆలయం వద్ద సంచరిస్తున్న ఎలుగుబంటి

కంప్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : హోస్పేట తాలుకాలోని కనివిరాయగుడి గ్రామ శివార్లలో శనివారం రాత్రి అంజనాదేవి ఆలయం వద్ద ఎలుగుబంటి ప్రత్యక్షమైంది. ఆలయ సమీపంలో ఎలుగుబంటి సంచారంతో భక్తులు బెంబేలెత్తారు. గర్భగుడికి తాళం వేసి వుండటంతో గర్భగుడి ముందు వుంచిన ప్రసాదాన్ని తిని అడవుల్లోకి వెళ్లింది. రాత్రివేళల్లో ఆలయం చుట్టూ విద్యుత్ లైట్లు, కంచె ఏర్పాటు చేసి ఎలుగు బంటి రాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


ముద్దాపురం వద్ద నేలవాలిన వరి పంట


వర్షానికి తడిసిన మొక్కజొన్నను ఆరబోస్తున్నకూలీలు

అన్నదాతను ముంచేసిన వర్షాలు

కంప్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బళ్లారి, విజయనగర జిల్లాల్లో వర్షాలు రైతులను నట్టేట ముంచాయి. ఇటీవల ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నేలకొరిగిన వరి కంకులకు మొలకలు మొలుస్తున్నాయి. తుంగభద్ర నది తీరం చుట్టూ పక్కల వుండే గ్రామాల బెళగోడుహాళ్, సన్నాపురం, ఇటిగి, మన్నూరు, సూగూరు, బసవేశ్వర క్యాంపు, మారెమ్మ క్యాంపు తదితర గ్రామాల్లో వర్షాభావానికి చేతికొచ్చిన వరిపంట గాలికి వర్షానికి నేలకొరిగిన పంటపైనే మొలకలు వచ్చాయి. వర్షం కారణంగా రైతులు భారీగా నష్టపోయామని వాపోతున్నారు. నారాయణస్వామి క్యాంపు రైతు అచ్యుత రాయ వర్మ మాట్లాడుతూ ఏడాది తెగులు ప్రభావం అధికంగా వుంది. నాట్లు సమయం నుండి పంట చేతికొచ్చే వరకు రసాయన ఎరువులు క్రిమికీటక మందులు వేస్తూ పంటలను కాపాడుకున్న చివరికి పంటలు కోతకొచ్చే వేళ వర్షాలు దెబ్బ తీస్తున్నాయన్నారు. దేవసముద్రం, మెట్రి, దేవలాపురం, చిన్నాపురం, ఉప్పరపల్లి తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంటలు వర్షానికి తడిసి ముద్దయ్యాయని రైతులు వాపోతున్నారు. ప్రతినిత్యం వర్షానికి తడిసిన మొక్కజొన్న పంటలను ఆరబోస్తూ వ్యాపారాలు కోసం ఎదురు చూపులు కాస్తున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పండిన పంటలకు గిట్టుబాటు రేటు లేక ఒక వైపు రైతు బాధపడుతుంటే ,మరొక వైపు వర్షాల కారణంగా నష్టపోతున్నామని మరొకవైపు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మొత్తానికి ఈ సారి ఖరీఫ్ పంటలు రైతులకు కష్టాలే మిగిల్చాయి.


కుడితినిలో ఆసుపత్రి ముందు నిలిచిన నీరు

ఎకరాకు రూ.40 వేలు పరిహారం ఇవ్వాలి

● మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వరి, మిరప, పత్తి పంటలు భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 40 వేలు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం తాలుకాలో భారీ వర్షాలతో దెబ్బతిన్న దేవీనగర్ గ్రామ పరిధిలోని పంటలను పరిశీలించారు. వరి పంట పూర్తిగా నేలపాలైందన్నారు. దీంతో వేలాది రూపాయలు వెచ్చించి పంట చేతికందే సరికి ఉరుములు, మెరుపులు ఈదురుగాలులు, అతి వర్షాలు కురవడంతో వరిపంట చేతికి రాక తీరని నష్టం జరిగిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.


దేవీనగర్ వద్ద వరి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

యువకుడి అదృశ్యం

● కుటుంబ సమేతంగా హంపి సందర్శనకు..


ఆదిత్యకుమార్

బళ్లారి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర లోని కోల్హాపూర్ నుంచి హంపి పర్యటనకు వచ్చిన టూరిస్టు ఆదిత్య కుమార్ అదృశ్యం అయినట్లు తండ్రి కాశీకుమార్ హంపీ టూరిస్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం హంపికి తల్లిదండ్రులతో పాటు ఆదిత్య కుమార్ ఇతర బంధవులు కలిసి వచ్చారు. వీరు శనివారం సాయంత్రం వాలీసుగ్రీవ గృహాల వద్ద పర్యటించారు. అనంతరం అక్కడ ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో ఆదిత్యకుమార్ ఈతలాడారు. తల్లిదండ్రులు మందలించి నీటి నుంచి బయటకు రమ్మని అక్కడి నుండి వారు విడిది ఉండే హోం స్టేకు వెళ్లిపోయారు. తరువాత ఆదిత్యకుమార్ తాగునీరు తెస్తానని చెప్పి రూం నుంచి బయటకు వచ్చాడు. తన సెల్‌ఫోన్, ఇతర వస్తువులు తల్లికి ఇచ్చి తను బయటకు వచ్చాడు. అప్పటి నుంచి ఆదిత్య కనిపించం లేదని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈతకు వెళ్లి నదిలో గల్లంతు అయ్యారా..? లేదా ఏదైనా రాతిగుహలో పడి గల్లంతు అయ్యాడా..? అనేది తెలియడం లేదని తల్లిదండ్రులు వాపోయారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1631.96
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	31,413	19,510
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	31,208	17,798
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.62

చెక్‌డ్యాంలో జారిపడి బాలుడి మృతి

బళ్లారి సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని శంకరబండే గ్రామానికి చెందిన హొన్నూర్, లక్ష్మీదంపతుల కుమారుడు పాల్ (15) ఆసుండి గ్రామం సమీపంలోని చెక్‌డ్యామ్‌లో పడి మృత్యువాత చెందాడు. తాలూకాలోని పీడీహళ్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎమ్మెల్యే బి.నాగేంద్ర మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. బాలుడి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ దుఃఖాన్ని భరించే శక్తి కుటుంబ సభ్యులకు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా పరిహారం అందేలా చూస్తామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

చెట్టు విరిగిపడి కారు ధ్వంసం



ధ్వంసమైన కారు వద్ద యజమాని జాఫర్

రాయచూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 15వ వార్డు జానిమొహల్లాలో అకస్మాత్తుగా చెట్టు విరిగిపడడంతో పక్కనే ఆగి ఉన్న ఓమిని వ్యాన్ ధ్వంసమైంది. జాఫర్ అనే చిరు వ్యాపారి పలు తినుబండారాలను సిద్ధం చేసి కారు ద్వార దుకాణాలకు వేస్తూ జీవనం సాగిస్తుండగా ఈ ప్రమాదంతో ఆయన వీధిన పడ్డాడు. శనివారం రాత్రి అకస్మాత్తుగా చెట్టు విరిగిపడడంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. కాగా జీవనోపాధి కోసం వినియోగిస్తున్న వాహనం ధ్వంసం కావడం ఆయనకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నిర్మాణ దశలో ఉన్న ఫ్లైఓవర్

నత్తనడకన ఫ్లైఓవర్ పనులు

- వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలు

కంప్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని కుడితిని రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న ఫ్లైఓవర్ నత్తనడకన సాగుతున్నాయి. 2017-18లో రూ. 27 కోట్లతో పనులు ప్రారంభించారు. రెండో విడతలో కేంద్ర ప్రభుత్వం రూ. 25 కోట్లు మొత్తం రూ.52 కోట్లు మంజూరు చేసింది. నిధులు మంజూరయినా ఫ్లైఓవర్ పనులు మాత్రం వేగవంతం కాలేదు. ఈ విషయంపైన ఎన్నోసార్లు ఎంపీ ఎమ్మెల్యేకు స్థానికులు ఫిర్యాదు కూడా చేశారు. ఫిర్యాదు మేరకు అప్పట్లో మాత్రం ఇదిగో అదిగో ఫ్లైఓవర్ పనులు పూర్తయి అందరికి అనుగుణంగా ఏర్పడుతుందని తెలుపుతున్నారని తెలిపారు. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ కేపీసీఎల్ ఏసీసీ సిమెంట్ అదానీ సంస్థ సహ జిందాల్ ఇతర పరిశ్రమలకు వెళ్లేందుకు నిత్యం వందల కొద్ది కార్మికులు ఈ రైల్వే పనులు ఆగుతూ సాగుతూ నడపటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. కురుగోడు పరిధిలోని బాదనట్టి, సిద్దమ్మనహళ్లి, ఏళబెంచి, ఎర్రంగళి, ఎస్‌ఆర్‌పురం, తదితర గ్రామాల నుండి ప్రతి రోజు ఉదయం విధులకు చేరుకుని తిరిగి సాయంత్రం ఇళ్లకు చేరుకుంటున్నారు. రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న ఫ్లైఓవర్ పనుల వల్ల తాత్కాలికంగా చేసిన రోడ్డుపై వెళ్లాలంటే ఎంతో కష్టంగా మారిందని పేర్కొంటున్నారు. మట్టి రోడ్డు వుండటంతో వర్షపు నీరు చేరుకుని ద్విచక్ర వాహనాలు పలు సార్లు బోల్తాపడి గాయాలకు గురయ్యామని తెలిపారు. రోజులు గడుస్తున్నా గానీ ఫ్లైఓవర్ పనులు మాత్రం పూర్తిగా కాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా స్థానిక ఎంపీ నత్తనడకన జరుగుతున్న ఫ్లైఓవర్ పనులపై దృష్టిసారించి త్వరగా పూర్తిచేసి రైతులకు, ప్రజలకు విద్యార్థులకు పరిశ్రమకు వెళ్లే కూలీలకు అనుగుణంగా చేపట్టాలని కోరారు.



నత్తనడకన సాగుతున్న పనులు



ధ్వంసమైన తాత్కాలిక రోడ్డు

దేవదాసీలను కులగణనలో చేర్చాలని వినతి

సిరుగుప్ప, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : దేవదాసీలను కులగణనలో చేర్చుకుని పునర్ వసతులు కల్పించాలని ఈరమ్మ ప్రభుత్వాన్ని కోరారు. సిరుగుప్ప తాలుకాలో దేవదాసీలు, శిశు అభివృద్ధియోజన సూపర్‌వైజర్ మహదేవికు వినతిపత్రం అందజేశారు. దేవదాసీలకు ప్రభుత్వం సౌలభ్యాలను అందజేయాలని ఆమె కోరారు. దేవదాసీల అధ్యక్షురాలు ఈరమ్మ మాట్లాడుతూ దేవదాసీల కుటుంబాలను కులగణనలో చేర్పించి మౌలిక సదుపాయాలతో పాటు ప్రతి ఒక్కరికి రెండు ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా దేవదాసీలు దుర్గమ్మ, మారెమ్మ, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న దేవదాసీల సంఘం అధ్యక్షురాలు ఈరమ్మ



ఎన్టీఆర్ అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

అన్నదానం.. హర్షణీయం

- ఎన్టీఆర్ అన్నదాన ట్రస్టుకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రశంసలు

బళ్లారి అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని ట్రామాకేర్ ఆసుపత్రి ఆవరణలో ఎన్టీఆర్ నిత్య అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యం అన్నదానం నిర్వహించడం హర్షణీయమని గోదావరి జిల్లా దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రోగులకు అన్నం వడ్డించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ అన్నదాన ట్రస్ట్ నుంచి 437రోజుల పాటు అన్నదానం చేస్తూ రోగులు, సహాయకుల ఆకలి తీరుస్తున్నారన్నారు. అన్నదాన కార్యక్రమం గురించి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, మంత్రి లోకేష్‌కు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ అన్నదాన కార్యక్రమం అధ్యక్షుడు గుర్రం లాల్‌మోహన్, బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయులు, హరిబాబు, మెహన్‌దాస్, రామనాయుడు, ప్రకాశ్, ఉమాపతి, విజయ్‌కుమార్, కంట్రాక్టర్ రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యరత్న అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న తిమ్మనగౌడ సిద్దమ్మనహళ్లి

బళ్లారి సిటీ/రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని కేసీ రోడ్డు వెంకటేశ్వర ట్రేడర్స్ యజమాని, వ్యవసాయ పనిముట్లు అమ్మకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ కోశాధికారి హెచ్.తిమ్మనగౌడ సిద్దమ్మనహళ్ళి వాణిజ్య రత్న అవార్డు అందుకున్నారు. వడ్డర బండేలోని బాలాజీరావు రోడ్డుబలిజ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి కమర్షియల్ జెమ్ అవార్డుతో ఆయన్ని సత్కరించింది. వాణిజ్యం, సామాజిక అభివృద్ధికి ఆయన చేసిన కృషిని చాంబర్ ఆఫ్ కామర్స్ గుర్తించి ఈ అవార్డును సంస్థ అధ్యక్షుడు యశ్వంత్ రాజ్ నాగిరెడ్డి అందజేశారు. ఈసందర్భంగా సీనియర్ ఉపాధ్యక్షుడు అవ్వారా మంజునాథ్, ఉపాధ్యక్షుడు సంగనకల్లు దొడ్డనగౌడ, కోశాధికారి పి.పాలన్న తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

హోసూరు బస్టాండ్‌లో చెన్నై బాలిక

హోసూరు(క్రైం), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హోసూరు బస్టాండులో 16 ఏళ్ల బాలిక ఒంటరిగా తిరుగుతుండడంపై అనుమానంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి వచ్చి బాలికను విచారించారు. ఆ బాలిక చెన్నైలోని అంబత్తూరు ప్రాంతానికి చెందినదని, చెన్నైలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నట్టు తెలిపిందన్నారు. తర్వాత బాలికను హోసూరు ఆల్ ఉమెన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసు రక్షణలో ఉంచారు. ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆ బాలిక 10 రోజుల క్రితమే చెన్నైలో అదృశ్యమైనట్లు గుర్తించారు. బాలిక తండ్రి చెన్నైలోని కొరటూరు పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారని, కొరటూరు పోలీసులు ఆ బాలిక కోసం వెతుకుతున్నారని గుర్తించారు. ఇలా హోసూరు మహిళా పోలీసులు ఆ బాలికను విచారించి కొరటూరు పోలీసులకు సమాచారం అందించారు. ఈ తరుణంలో సదరు బాలికకు భోజనం అందించారు. అన్నం తిన్నాక చేతులు కడుకోవడానికి బయటికి వెళ్లి అక్కడినుంచి పారిపోయింది. ఎంతసేపటికి లోపలికి బాలిక రాకపోవడంతో పరిశీలించగా పారిపోయినట్టు గుర్తించారు. బాలిక కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

18 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు



కమిటీ చైర్మన్ శ్రీధర్‌తో డైరెక్టర్ కన్నప్పన్

హోసూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ జూజూవాడిలోని ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 18మంది ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ప్రస్తుతం 2,100 మంది విద్యార్థులు చదువుతున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 22 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించారు. ఈ పరిస్థితిలో 18 అదనపు పోస్టులు అవసరం కాబట్టి హోసూరు కార్పొరేషన్ విద్యా కమిటీ చైర్మన్ శ్రీధర్ చెన్నైకి వెళ్లి పాఠశాల విద్యా డైరెక్టర్ కన్నప్పన్‌ను స్వయంగా కలిసి పాఠశాలకు అదనపు శాశ్వత ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఎట్టకేలకు 18 పోస్టులను ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టుల మంజూరుపై కార్పొరేషన్ విద్యా కమిటీ చైర్మన్ శ్రీధర్‌కు, విద్యా డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల విద్యార్థుల దీర్ఘకాల డిమాండ్ నెరవేరిందని సంతోషించారు.

అన్నాడీఎంకే పార్టీ బలోపేతంపై సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న నాయకులు

హోసూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమజిల్లా హోసూరు మున్సిపాలిటీ తూర్పుజోన్ కార్యదర్శి రాజీ నేతృత్వంలో ఆదివారం హోసూరులో అన్నాడీఎంకే కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి , రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పన్నీర్‌సెల్వం ప్రత్యేక అతిథులుగా పాల్గొని పార్టీని ప్రోత్సహించడానికి సోషల్ మీడియా సహాయం తీసుకోవాలని దాని గురించి, పార్టీ సూత్రాలు, అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువయ్యేలా కొత్త కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బూత్ కమిటీ ఏర్పాటు, పార్టీ అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో పశ్చిమ జిల్లా కౌన్సిల్ చైర్మన్ నారాయణన్, సేలం జోన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డివిజన్ జాయింట్ సెక్రటరీ సతీష్, హోసూరు కార్పొరేషన్ కౌన్సిలర్లు మల్లికా దేవరాజ్, దిల్షాద్ ముజిపూర్ రెహమాన్, సర్కిల్ కార్యదర్శి హరి ప్రసాద్, జిల్లా నిర్వాహకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

హోసూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హోసూరు కలెక్టర్ ఆదేశాల మేరకు కృష్ణగిరి జిల్లాలో రెవెన్యూ పోలీసులు, ఖనిజ వనరుల శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా ఇతర రాష్ట్రాలకు ఖనిజాలను రవాణా చేసే వాహనాలను తనిఖీలు చేపట్టారు. హోసూరు మత్తిగిరి సర్కిల్‌లో ఉదయం 6 గంటలకు అత్తిబెలె రహదారిలో వాహన తనిఖీలు చేస్తున్న వేళ పర్మిట్ లేకుండా కంకరరాళ్లను తీసుకెళ్తున్న టిప్పర్‌లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో మత్తిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని డ్రైవర్‌ను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

కుడితినిలో భారీ వర్షం



జలమయమైన సంత

కంప్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఆదివారం సంత వుండటంతో కాయగూరలన్నీ నీటిపాలు అయ్యాయి. ఈ సంత స్థలంలో సరైన సదుపాయాలు లేక మార్కెట్లో వ్యాపారస్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షం కాంరణంగా కాయగూరలన్నీ నీటిపాలయ్యాయి. ఈ సందర్భంగా పట్టణం హితరక్షణ సమితి అధ్యక్షుడు కామేష్ మాట్లాడుతూ పట్టణం నడిబొడ్డున డీఎంఎఫ్ నిధులతో ఆంజనేయస్వామి ఆలయం ఎదురుభాగంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలోనే కాయగూరలు మార్కెట్ ఏర్పాటు చేశారు. కానీ వ్యాపారస్తులకు సరైన సౌకర్యం లేకుండా పోవడంతో కాయగూరలు నీటిపాలయ్యాయి. భారీ వర్షం రాకతో ప్రభుత్వ ఆస్పత్రి ముందు భాగంలో నీరు నిలిచిపోయి ఆస్పత్రికు వచ్చేవారికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా కుడితినిలో భారీ వర్షం రావడంతో ఎక్కడ చూసినా కుడితినిలో వర్షపునీరే కనిపిస్తున్నాయి.



కుడితినిలో కురుస్తున్న వాన

మానసిక ఆరోగ్యం పై అవగాహన తప్పనిసరి: ఎస్పీ

రాయచూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కేసుల విచారణ సందర్భంగా నిందితుల మానసిక ఆరోగ్యం పట్ల పోలీసులు జాగ్రతలు తీసుకోవాలని రాయచూరు జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య సూచించారు. మానసిక అనారోగ్యం తలెత్తిన సందర్భంలో వ్యక్తులు నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందన్న విషయాన్ని పోలీస్ అధికారులు గుర్తెరగాలన్నారు. మానసిక ఆరోగ్య చట్టం 2017 పై పోలీస్ అధికారులకు ఆదివారం నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో అవగాహన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ పుట్టమాదయ్య, మానసిక ఆరోగ్యం సరిగ్గా లేని వ్యక్తులు తటస్థించిన సందర్భంలో తీసుకోవల్సిన జాగ్రతలు చట్టపరంగా వారికి కల్పించాల్సిన రక్షణ కుటుంబస్థులకు ఇవ్వాల్సిన సమాచారం ప్రాథమికంగా చేయాల్సిన విధుల గురించి పోలీసులకు విపులంగా వివరించారు. శాంతి భద్రతలు కాపాడే పోలీసులు మానసికంగా ధృడంగా ఉండాలన్నారు.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ పుట్టమాదయ్య

గుంతల పూడ్చివేత



మరమ్మతులు చేస్తున్న జిందాల్ కంపెనీ సిబ్బంది

బళ్లారి సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరం నుంచి బొమ్మనహాళ్‌కు వెళ్ళే రోడ్డుపై గుంతలను జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో పూడ్చివేశారు. గుంతలను పూడ్చేందుకు ప్రజా పనుల శాఖ, గ్రామీణ రోడ్డు సంస్థ ముందుకు రాలేదు. ప్రజలు గోతులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. సమస్యపై స్పందించిన జేఎస్‌డబ్ల్యూ కంపెనీ తమ ఫ్యాక్టరీ వద్ద ఉన్న రాళ్లను, మట్టిని కంపెనీ వాహనాల్లో తీసుకొచ్చి గుంతలను పూడ్చేశారు. ఈరోడ్డును అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే డీపీఆర్‌ను సిద్ధం చేసింది. పనులు జరగలేదు. జిందాల్ కంపెనీ ఔదర్యాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

బళ్లారిరూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని అసొండి గ్రామానికి చెందిన రవికుమార్(30) గురువారం హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఫర్టిలైజర్స్ పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా రవికుమార్‌ను హత్య చేశారని అన్న శేఖర్ పీడీహళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ డాక్టర్ శోభారాణి ఆదేశాలతో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రుద్రయ్య, ఎస్ఐ తిమ్మారెడ్డి, మోకా ఎస్ఐ కాళింగ నేతృత్వంలో అసొండి గ్రామానికి చెందిన పదిమంది హత్యకేసు నిందితులను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పీడీహళ్లి పోలీసులు తెలిపారు. పోలీసు సిబ్బంది ఏఎస్ఐ దుర్గాప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, రవికుమార్, నరసింహ, ధారాసింగ్, జగన్నాథ్, కుమారస్వామి, రవికుమార్ తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్ననాయకులు

రాయచూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయత్ రాజ్, ఐటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గెకు వ్యతిరేఖంగా బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలు బెదిరింపులను నిరసిస్తూ ఆదివారం లింగసుగూరు పట్టణంలో కాంగ్రెస్ నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక గాంధిచౌక్ తదితర రోడ్ల గుండా సాగిన ప్రదర్శనలో బీజేపీ నాయకులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రియాంక ఖర్గేను విమర్శించడమే గాక వ్యక్తిగత దోషణలు చేయడంతో పాటు ఆయనను బెదిరింపులకు గురిచేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కేఆర్ నారాయణ్ (జయంతి)



దేశ పదో రాష్ట్రపతిగా 1997-2002 వరకు వ్యవహరించిన కొచెరిల్ రామన్ (కేఆర్) నారాయణన్ 1920 అక్టోబరు 27న కేరళ రాష్ట్రం ఉఝవూర్‌లో జన్మించారు. 1992-97 వరకు ఉప రాష్ట్రపతిగా వ్యవహరించారు. అంతకుముందు కేంద్ర విదేశాంగశాఖలో కీలకంగా పని చేశారు. ఐఎఫ్ఎస్‌ను వీడి రాజకీయాల్లోకి వచ్చి ఇందిరాగాంధీ సూచనతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి వరుసగా మూడుసార్లు గెలుపొందారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటించుకుని రాష్ట్రపతిగా తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. 2005 నవంబరు 5న కన్నుమూశారు.

శివకుమార్ (పుట్టినరోజు)



అలనాటి తమిళ నటుడు శివకుమార్ 1941 అక్టోబరు 27న కోయంబత్తూరులో జన్మించారు. అసలు పేరు పళనిస్వామి. 200కు పైగా సినిమాలలో నటించారు. 3 ఫిల్మ్‌ఫేర్, 2 తమిళనాడు రాష్ట్ర అవార్డులు పొందారు. మూడు తరాల నటులతో కలసి నటించారు. అగరం ఫౌండేషన్ ద్వారా ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేస్తూ యువతలో చైతన్యం కల్పిస్తున్నారు. కాగా ఆయన కుమారులు సూర్య కార్తిలు కూడా నటులుగా రాణిస్తూ ఎంతో పేరొందారు.

అనురాధా పౌడ్వాల్ (పుట్టినరోజు)



నేపథ్య గాయని 'పద్మశ్రీ' గ్రహీత అనురాధా పౌడ్వాల్ 1954 అక్టోబరు 27న ఉత్తరకన్నడ జిల్లా కార్వారలో జన్మించారు. నేషనల్ ఫిల్మ్ అవార్డు, నాలుగుసార్లు ఉత్తమ గాయనిగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారం, మహ్మద్ రఫీ అవార్డు, మదర్ థెరెసా అవార్డు జీవనసాఫల్య పురస్కారం, ఇతర గౌరవాలు అందుకున్నారు. ఆమె ఆలపించిన పాటలు ఎక్కువగా టి-సిరీస్ ద్వారా భజనలు, అనేక ఆల్బమ్‌లు విడుదలయ్యాయి. తెలుగు, హిందీ, కన్నడ, రాజస్థానీ, మరాఠీ, బెంగాలీ, సంస్కృతం, గుజరాతీ, ఒరియా పంజాబీ, నేపాలీ తదితర భాషలలో పాటలు పాడారు. డివై పాటిల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా తన సంపాదనలో కొంతమొత్తాన్ని సైనిక, పేద కుటుంబాల సాయానికి ఖర్చు చేయడం విశేషం. ఇటీవల ఆమె బీజేపీలో చేరి రాజకీయాలపై ఆసక్తి కనబరిచారు.

సంగక్కర (పుట్టినరోజు)



శ్రీలంక దేశ క్రికెటర్ కుమార సంగక్కర 1977 అక్టోబరు 27న జన్మించారు. శ్రీలంక క్రికెట్ జాతీయ జట్టుకు కేప్టెన్‌గా వ్యవహరించారు. తన 15ఏళ్ల కెరీర్‌లో గొప్ప బ్యాట్స్‌మెన్‌గా, వికెట్ కీపర్‌గా గుర్తింపు పొందారు. 2012లో ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచారు. 2014 ఐసీసీ వరల్డ్ ట్వంటీ-20లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచి ట్రోఫీని దక్కించుకున్నారు. వన్డేలలోనూ, టెస్టు మ్యాచ్‌లలోనూ అనేక రికార్డులు సాధించారు. కామెంటేటర్‌గాను వ్యవహరించారు. 2021లో ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు కోచ్‌గా వ్యవహరించారు. కాగా ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేంలో చోటు పొందారు. యునిసెఫ్, యూఎన్‌లు చేపట్టిన సామాజిక అంశాలపై చైతన్యం కల్పించడంలో క్రియాశీలకంగా ఉన్నారు.

ఇర్ఫాన్ పఠాన్ (పుట్టినరోజు)



ఇర్ఫాన్ పఠాన్ 1984 అక్టోబరు 27న గుజరాత్ రాష్ట్రం వడోదరలో జన్మించారు. బౌలర్‌గానేకాక ఆల్‌రౌండర్‌గా రాణించారు. ఇండియన్ క్రికెట్ టీమ్‌లో తనదైన గుర్తింపు పొందారు. 2007 ఐసీసీ ట్వంటీ-20 వరల్డ్ కప్, 2013 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలోనూ తన ప్రతిభను చాటారు. 2020లో క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. సోదరుడు యూసుఫ్‌ఖాన్‌తో కలసి క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేశారు.

బాలకృష్ణ గురించి మాట్లాడే ముందు
ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి

- జగన్‌కు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హెచ్చరిక



అనంతపురం అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గురించి మాట్లాడే ముందు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని వైఎస్ జగన్‌ను మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు హెచ్చరించారు. అసెంబ్లీకి నందమూరి బాలకృష్ణ తాగొచ్చారని జగన్ విమర్శించడంపై ఎంఎస్ రాజు తీవ్ర స్థాయిలో స్పందించారు. జగన్ వ్యాఖ్యలను ఖండించారు. ఆదివారం అనంతపురంలో ఎంఎస్ రాజు మీడియాతో మాట్లాడుతూ... బాలకృష్ణను ఉద్దేశించి జగన్ చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవడంతో పాటు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బాలకృష్ణపై అవాకులు, చవాకులు పేలితే అభిమానులెవరూ సహించే పరిస్థితి ఉండదన్న విషయం జగన్ గుర్తుంచుకోవాలన్నారు. సమాజంలో గౌరవమర్యాదలు కలిగిన వ్యక్తిపై ఉద్దేశపూర్వకంగా బురద జల్లడం జగన్‌కు తగదన్నారు. మంచికి మారు పేరు బాలకృష్ణ అన్నారు. తన పనితాను చేసుకుపోయే మనస్తత్వం ఉన్న వ్యక్తి అన్నారు. తండ్రి పదవిని, పార్టీని అడ్డుపెట్టుకుని అక్రమాలు, దుర్మార్గాలకు పాల్పడే వ్యక్తి బాలకృష్ణ కాదని జగన్‌కు చురక అంటించారు. 'బాలకృష్ణ అసెంబ్లీకి తాగి వచ్చాడంటున్నావ్.. కదా.. మందు నువ్వు కలిపిచ్చావా' అని జగన్‌ను ప్రశ్నించారు. సైకో పోవాలి.. సైకిల్ రావాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ నినదించిన వారేనన్నారు. 'వైసీపీ పాలనలో తాగుబోతుల సంఘానికి అధ్యక్షుడు నువ్వు కాదా జగన్' అని నిలదీశారు. మద్యం తాగేవాళ్లు కూడా మాట్లాడని రీతిలో వైసీపీ పాలనలో మాట్లాడిన మాటలు గుర్తు లేవా అని నిలదీశారు. మరోసారి బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

వైభవంగా కైవార యోగి నారేయణ విగ్రహ ప్రతిష్ఠ



సోమేశ్వరస్వామికి విశేష అలంకరణ



యోగినారేయణస్వామి మూలవిరాట్టు



పురవీధుల్లో పల్లకి ఉత్సవం

ముళబాగిలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హొసపాళ్యలో సద్గురు కైవార యోగినారేయణ తాతయ్య మఠం అభివృద్ధి ట్రస్టు ఆధ్వర్యంలో సద్గురు కైవార యోగినారేయణ యతీంద్ర మూర్తి ప్రతిష్ఠాపన, శిఖర కళశ స్థాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా యోగి నారేయణ ఉత్సవమూర్తిని అలంకరించిన పల్లకీలో పురవీధులలో ఊరేగించారు. గారడీ బొమ్మలు, కళాబృందాలు సందడి చేశాయి. కార్యక్రమంలో మఠం ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం, ఎమ్మెల్సీ ఎంఆర్ సీతారాం, ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్, తహసీల్దార్ వీ గీతా, ఏఎస్పీ మనిషా, నగరసభ కమిషనర్ వీ శ్రీధర్, మఠం ట్రస్టు పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వర ఆలయంలో విశేష పూజలు

పట్టణంలోని సోమేశ్వరపాళ్యలో పురాణ ప్రసిద్ధమైన ప్రసన్న సోమేశ్వర ఆలయంలో కార్తీకపంచమిని పురస్కరించుకుని ఆదివారం విశేషపూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మూల విరాట్టుకు పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, పార్వతీదేవి, బాలసుబ్రమణ్యం, కాలభైరవేశ్వర, బసవన్న, చాముండేశ్వరి, నీలకంఠేశ్వర దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏపీ రామనాథ్‌దీక్షిత్ నేతృత్వంలో పూజా కైంకర్యాలు కొనసాగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం పెంపొందించాలి

- శాస్త్రవేత్త డాక్టర్ కె.సిద్దప్ప



వేదికపై నాటక పాత్రధారులతో ప్రముఖులు

దావణగెరె, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో ప్రశ్నించే విధానం పెంపొందించాలని అప్పుడే వారికి సమగ్రమైన అవగాహన సాధ్యం కానుందని ఆటామిక్ శాస్త్రవేత్త డాక్టర్ కే సిద్దప్ప ప్రతిపాదించారు. దావణగెరెలోని బీఐఈటీ కాలేజ్‌లోని ఎస్ఎస్‌మల్లికార్జున సాంస్కృతిక సభాంగణంలో శనివారం యుగపురుషుడు అల్బర్ట్ ఐన్‌స్టీన్ నాటకాన్ని ప్రదర్శించారు. బెంగళూరుకు చెందిన పీఈఎస్ యూనివర్సిటీ ఆర్ట్స్ విద్యార్థులు నాటికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ కే సిద్దప్ప మాట్లాడుతూ పరమాణువులో మూడు విభాగాలు కీలకమని, ప్రోటాన్, న్యూట్రాన్, ఎలక్ట్రానిక్స్ పాత్రలతోనే నాటికను రచించానన్నారు. నేటితరం విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నదే నా ఆశయమన్నారు. నాటికను డాక్టర్ ఎస్‌వీ సుష్మ దర్శకత్వంలో 65 నిమిషాలపాటు ప్రదర్శించారు. ఇదే సందర్భంగా సానేహళ్ళి మఠాధిపతి పండితారాధ్య శివాచార్యస్వామి మాట్లాడుతూ నవంబరు 2నుంచి సానేహళ్ళి మఠంలో జరిగే నాటకోత్సవంలో పాల్గొనాలని విద్యార్థులను, ప్రముఖులను ఆహ్వానించారు. ఎంపీ ప్రభా మల్లికార్జునతోపాటు పీఈఎస్ అధ్యాపకురాలు, డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీ సుష్మ, ప్రతిమతోపాటు పలువురు పాల్గొన్నారు. నాటక ప్రదర్శన సభికులను అలరించింది.

టీఏపీసీఎంఎస్ అధ్యక్షురాలిగా మీనాక్షి



అధ్యక్ష, ఉపాధ్యక్షులతో ఎమ్మెల్యే, తదితరులు

బంగారపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ సహకార సంఘం (టీఏపీసీఎంఎస్) అధ్యక్షులుగా మీనాక్షి చంద్రప్ప, ఉపాధ్యక్షులుగా ఆ.నా.హరీశ్ ఎన్నికయ్యారు. సంఘానికి ఈనెల 12న డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు జరిగాయి. తాజాగా ఆదివారం అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా మీనాక్షి, హరీశ్‌లు గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణ స్వామి ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీఏపీసీఎంఎస్ ఎన్నికల్లో ఇదే తొలిసారి మహిళా అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా ఎస్సీ వర్గానికి చెందినవారు గెలుపొందారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొలిసారిగా కాంగ్రెస్ మద్దతుదారులు అధికారపగ్గాలు చేపట్టారన్నారు. గతంలో అధికారంలో ఉన్నవారు అంతా ఊడ్చిపెట్టి తలకిందులు చేశారన్నారు. ఇప్పుడు సొంత పెట్టుబడులతో రైతులకు అనుకూలం చేస్తారని అంటున్నారన్నారు. ప్రతిపక్షాల విమర్శలపై ఘాటుగా వ్యాఖ్యానించారు. కే చంద్రారెడ్డి, పార్థసారథి, కేవీ నాగ రాజ్, మహదేవప్ప, మునిస్వామిప్ప, డైరెక్టర్లు కృష్ణేగౌడ, వెంకటేశ్, నారా యణస్వామి, ప్రముఖులు బాబు, విజయ్‌కుమార్, ఎంఎ మునిరాజు, నంజప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా శౌర్యవీర్ రన్



రన్‌లో పాల్గొన్న యువత, విద్యార్థులు

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మరాఠా లైట్ ఇన్‌ఫ్యాంట్రి రెజిమెంటల్ సెంటర్ (ఎల్ఐఆర్‌సీ) ఆధ్వర్యంలో బెళగావిలోని శివాజి స్టేడియంలో శౌర్యవీర్ రన్ 2025 పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 79వ ఇన్‌ఫ్యాంట్రి డేలో భాగంగా ఆదివారం రన్ చేపట్టారు. కమాండెంట్ బ్రిగేడియర్ జాయ్‌దిప్ ముఖర్జీ రన్‌కు పచ్చజెండాచూపారు. స్పిరిట్ ఆఫ్ ది ఇన్‌ఫ్యాంట్రిల ధైర్య సాహసాలను చాటేలా నిర్వహించిన రన్ కొనసాగిందన్నారు. హాఫ్ మారథాన్ 21 కిమీ, టైమ్డ్ రన్ 10కిమీ, ఫన్ రన్ 5 కిమీ విభాగాలలో రన్ కొనసాగింది. పోటీలలో యువత, విద్యార్థులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వివిధ విభాగాల విజేతలకు ప్రశంసాపత్రాలు అందచేశారు.

జీఎస్టీ 2.0.. వ్యాపారులకు అనుకూలం

- ఎస్‌పీరోడ్డు హబ్బలో ఎంపీ లెహర్‌సింగ్



కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు లెహర్‌సింగ్, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి తదితరులు

బెంగళూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో వ్యాపారులకు అనుకూలమని వినియోగదారులకు మిగులు సాధ్యమైందని రాజ్యసభ సభ్యుడు లెహర్‌సింగ్ సిరోయా అభిప్రాయపడ్డారు. నెలరోజులపాటు సాగిన ఎస్‌పీ రోడ్డు హెబ్బ ముగింపు కార్యక్రమం శనివారం ఏర్పాటైంది. పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి, ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్, బీజేపీ మీడియా సంచాలకులు కరుణాకర్ కసాలెలు పాల్గొన్నారు. లెహర్‌సింగ్ మాట్లాడుతూ 1970 నుంచి ఎస్‌పీ రోడ్డులో వ్యాపారస్తులతో అనుబంధాన్ని గుర్తు చేశారు. దక్షిణభారత్‌కే అతిపెద్ద ఎలక్ట్రికల్ మార్కెట్‌గా కొనసాగుతోందన్నారు. అందరితో స్నేహంగా ఉండడమే నా ఆశయమన్నారు. చలవాది నారాయణస్వామి మాట్లాడుతూ ఓకల్ ఫర్ లోకల్ అనే నినాదంతో దేశీయ ఉత్పత్తులకు వ్యాపారాన్ని పెంపొందించేందుకు ఇదో అవకాశం అన్నారు. కరుణాకర్ మాట్లాడుతూ జీఎస్టీ సవరణతో దేశమంతటా దీపావళి కానుకను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఇచ్చారన్నారు. సిమెంటుపై జీఎస్టీని 33నుంచి 18శాతానికి తగ్గించడం నిర్మాణరంగానికి అతిపెద్ద ఉపశమనం అన్నారు. అసోసియేషన్ ఫర్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అధ్యక్షులు ఆనందరావ్, బెంగళూరు ఎలక్ట్రానిక్స్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు విశాల్ వరందాని, కార్యదర్శి అరుణ్‌జైన్, ఉపాధ్యక్షులు లలిత్ డకాలియాలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు

శిడ్లఘట్ట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని వై హుణసేనహళ్ళి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైదేహి ఆసుపత్రి సహకారంతో ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరం నిర్వహించారు. గుండె, నరాలు, కిడ్నీలో రాళ్లు, ఈఎన్‌టీ, ఎకో, ఈసీజీ తదితర పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఇప్పటికే ఇరగంపల్లి, చేళూరు, అక్కిమంగళ, కురుబూరు, కెంచార్లహళ్ళి, కుందలగుర్కిలోని పీహెచ్‌సీలలో ఉచిత శిబిరాలు కొనసాగాయి. ఈనెల 30న మేలూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కూడా నిపుణులైన వైద్యబృందంచే శిబిరం ఉంటుందని వై హుణసేనహళ్ళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ తేజశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు గోవింద్, సుష్మా, పృథ్వి, నమ్రతా, సంజనా తదితరులు ఉన్నారు.

ఎన్నికల కమిషన్‌పై పెత్తనం తగదు: సీపీఐ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు కే ప్రకాశ్

రాయచూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను కీలుబొమ్మగా మార్చేందుకు అనేక రకాల కుయుక్తులను పన్నుతున్నట్లు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి కే ప్రకాశ్ ఆరోపించారు. అందులో భాగంగానే ఎస్ఐఆర్ పేరుతో పలు సవరణలకు, మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆదివారం నగరంలోని ప్రభుత్వ ఉద్యోగ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని కే ప్రకాశ్ మాట్లాడారు. హిందూరాజ్యంగా మార్చేందుకు రాజ్యాంగ సవరణకు సిద్ధపడుతున్న బీజేపీ ప్రభుత్వం అందుకు తగిన అవకాశం దక్కకపోవడంతో ఇతర మార్గాల్లో వ్యవస్థను తన చెప్పు చేతల్లోకి తెచ్చుకునేందుకు వివిధ రకాల ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ఆరోపించారు. గతంలోను ఎస్ఐఆర్ సవరణలు జరిగినా వాటిని ఇప్పటి వరకు అందుబాటులో ఉంచలేదన్నారు. ఎస్ఐఆర్ సవరణల పేరుతో తమకు అనుకూలమైన విధానాలను రూపొందిస్తున్న బీజేపీ ప్రభుత్వం అందులో భాగంగానే వివరాలు ఇవ్వకుండా దాచి ఉంచుతున్నట్లు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. విద్యావంతులు మేధావులు ఇలాంటి కుట్రలను తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

2న రొమ్ము క్యాన్సర్‌పై జాగృతి

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కర్ణాటక క్యాన్సర్ సొసైటీ, బీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నవంబరు 2న బ్రెస్ట్ క్యాన్సర్‌పై జాగృతి మాసోత్సవం, కన్నడ రాజ్యోత్సవ వేడుకలు జరుపుతున్నట్టు క్యాన్సర్ సొసైటీ వైద్య కమిటీ అధ్యక్షులు సీపీ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. బనశంకరిలోని బీఎస్ఎం ఆడిటోరియంలో జరిగే కార్యక్రమాన్ని ప్రముఖ నటుడు సుచేంద్రప్రసాద్ ప్రారంభించనుండగా బీఎస్ఎం కళాశాల చైర్మన్ నారాయణరావు ఆర్ మానె అధ్యక్షత వహించనున్నారు. హెచ్‌సీజీ ఆసుపత్రి వైద్యుడు శేఖర్ పాటిల్, వీవీఐపీ సెక్యూరిటీ డీసీపీ మంజునాథబాబుతోపాటు గిరీశ్‌హెగ్డే, బ్రజకిశోర్ ప్రధాన్, క్యాన్సర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎంఆర్ కులకర్ణి పాల్గొంటారని తెలిపారు.

అత్యాధునిక వైద్యసేవలను వినియోగించుకోవాలి

బెంగళూరు, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): మహిళలు సంతాన సాఫల్యంకోసం అత్యాధునిక వైద్యసేవలను వినియోగించుకోవాలని ఎంపీ తేజస్విసూర్య అభిప్రాయపడ్డారు. నాగరబావిలో సంతతి ఐవీఎఫ్ కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యేలు కృష్ణప్ప, ప్రియాకృష్ణలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తేజస్విసూర్య మాట్లాడుతూ ఆధునికజీవనశైలితో పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆరోగ్యంపట్ల ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. ఎమ్మెల్యే కృష్ణప్ప మాట్లాడుతూ సంతానం అనేది దంపతుల ఆశయమని, అందుకు వైద్యుల సలహాలు పాటించాలన్నారు. నైరుతివిభాగం డీసీపీ అనితా బీ హడ్డణ్ణవర్‌తోపాటు వ్యవస్థాపకురాలు డాక్టర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

చామరాజపేట కరవే అధ్యక్షుడిగా గంగాధర్



గంగాధర్‌ను అభినందిస్తున్న టీఏ నారాయణగౌడ తదితరులు

బెంగళూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రక్షణా వేదిక (కరవే) చామరాజపేట ప్రాంత అధ్యక్షుడిగా గంగాధర్‌ను నియమించారు. కరవే వ్యవస్థాపక అధ్యక్షులు టీఏ నారాయణగౌడ ఈమేరకు ప్రకటించారు. ఈ సందర్భంగా నారాయణగౌడ మాట్లాడుతూ కర్ణాటక రక్షణా వేదిక నిరంతరంగా ప్రజలకు సేవ అందించడంతోపాటు రాష్ట్రానికి సంబంధించిన సామాజిక పోరాటాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కరవే బెంగళూరు నగర అధ్యక్షులు ధర్మరాజగౌడ, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, గాంధీనగర్ ప్రాంత అధ్యక్షుడు బీజీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేష పూజలు



స్వామివారికి విశేష అలంకరణ

శిడ్లఘట్ట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరదహళ్ళి తోటలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. అభిషేకం, మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బీటీపీ గేట్ల ఎత్తివేత



గుమ్మఘట్ట, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): బీటీ ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక ప్రాంతం నుంచి నాలుగు వేల క్యూసెక్కుల వరద నీటి ఉధృతి కొనసాగుతోంది. దీంతో ఆదివారం ఉదయం ప్రాజెక్టు నాలుగు గేట్ల ద్వారా 3,500 క్యూసెక్కుల నీటిని దిగువ హగరికి విడుదల చేశారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1655 అడుగులు కాగా, 1654 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటిని దృష్టిలో ఉంచుకుని దిగువకు వదులుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. దీంతోపాటు ఎడమకాలువ ద్వారా గుమ్మగట్ట, కల్లుగొడు, భూపసముద్రం చెరువులు నింపేందుకు 200 క్యూసెక్కుల నీటిని చెరువుకు వదిలారు. బీటీపీ వరదనీటి ప్రవాహంతో బ్రహ్మసముద్రం మండల పరిధిలోని 10 గ్రామాల ప్రజలకు రాయదుర్గం పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి వేపలపర్తి కాజ్‌వే పై పోలీసులు రాకపోకలు లేకుండా అడ్డు వేశారు. దీంతో ఇక్కడి ప్రజలు రాయదుర్గం చేరుకోవాలంటే 40 కిలో మీటర్లు బీటీ ప్రాజెక్టుపై వెళ్లాల్సి ఉంది. బీటీ ప్రాజెక్టు వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఆదివారం మధ్యాహ్నం కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు పరిశీలించి బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట పోలీసులను అప్రమత్తం చేశారు. అనుమతించాలని మత్స్యకారులు డీఎస్పీకి విన్నవించారు.